"రాజులు అభ్యర్థులుగా నిలబడటం గురించి నెహ్రూ అన్న మాట విన్నారా?"

"నెహ్రూ చాలా మాటలన్నాడు. అందులో ఏమీ లేదు. నాకు పోటీగా అభ్యర్థిని నిలబెట్టబోమని స్థానిక కాంగ్రెసువారు లోపాయికారీగా మాట ఇచ్చారు. పోటీ మనకూ నులకయ్యకూ మధ్య ఉన్నది."

"మిమ్మల్ని గెలవకుండా చెయ్యటానికి కమ్యూనిస్టులు శాయశక్తులా ప్రయత్నిస్తారనుకుంటాను", అన్నాను.

"నులకయ్య గెలవకుండా చెయ్యటానికి మనం మటుకు ప్రయత్నించలేమా?"

"ఏమైనా ఆలోచించి పెట్టారా?"

"చాలా సలహాలు వచ్చాయి. వాటిని గురించే ఆలోచిస్తున్నాను. నులకయ్య బాలెట్ పెట్టెకు చిల్లి లేకుండా చెయ్యమని ఒకరి సలహా. నులకయ్యను రెండు రోజులు ముందుగానే ఎరెస్టుచేయించి, పోలింగురోజు ఉదయమే అతను చచ్చిపోయినట్టు ప్రచారం చెయ్యమని ఇంకొకరి సలహా. ఊళ్లో కలరా వచ్చిందని పుకారు పుట్టించమనీ, అట్లా చేస్తే వోటర్లు బయటికి రారనీ మరొక సలహా. ఈ పెద్దమనిషి చూడండి ఇంకో సలహా ఇస్తున్నాడు. "కమ్యూనిస్టులు క్యూలు నిలబెట్టుతున్నారు ఆ క్యూల మీదికి లారీలనూ, కార్లనూ తోలి చెదరగొట్టండి. తరవాత మనమనుష్యులను క్యూలో నిలబెట్టవచ్చు. కావలిస్తే లారీ డ్రైవర్లను తాత్కాలికంగా ఎరెస్టు చెయ్యవచ్చు! సలహాలకేం చాలా వస్తున్నాయి. మనకు మనసే ఉండాలిగాని మార్గాలు లేకపోతాయా?"

"షేష్! బాగుంది! చాలా బాగుంది! ఇక నేను మీ విజయాన్ని ఆకాంక్షించటం తప్ప వేరే చేయదగిం దేమిటి గనకా!" అన్నాను.

నిన్ననే దిబ్బరాజ్యంలో పోలింగు జరిగింది. నాలుగు రోజులనుంచీ నులకయ్య జైల్లో ఉన్నాడు. మొన్నటినుంచీ అక్కడ కలరా ఉధృతంగా ఉన్నట్టు పత్రికల్లో చదివాను. పోలింగు సమయంలో లారీ ఒకటి కంట్రోలు తప్పి వోటర్ల క్యూ మీదికి పోయినట్టూ ఇద్దరు గాయపడ్డట్టూ తెలుస్తున్నది. కాని వోటర్లు నిరుత్సాహం చెందలేదు. నిశ్చలంగా నిలబడి వోటు చేశారు. నూటికి 95 వంతులు వోట్లు పోలయినట్టు అంచనా. దిబ్బరాజుగారికి డిపాజిట్ దక్కదని ఒక వదంతి. గిట్టనివాళ్ళు ఇటువంటి వదంతులు వేస్తారు. ఎన్నికల ఫలితాలు పత్రికలో పడినదాకా మనమేమీ అనకూడదు.

కథానిక

# గర్వకారణం

ప్రేమంరాజు కృష్ణమోహన్

మా వూరి ప్రజలు సామాన్యులు కారు. మా గ్రామంలో ధనిక భూస్వాములున్నారు. మధ్యతరగతి రైతులున్నారు. పేద ప్రజలున్నారు. ఇద్దరు సంస్కృత పండితులున్నారు. స్కూలుఫైనలు కొద్ది మార్కులు తక్కువతో మూడుసార్లు తప్పిన ఘనులు ఇద్దరున్నారు. మా వూరి ప్రజలు అన్ని రాజకీయపక్షాలకు చెందినవారు. విచిత్రమేమంటే జెండాలు మాత్రమే మావూళ్లో లేవు. కాబట్టి మా వూరి వాళ్ళు రాజకీయ మేధావులు. అందులో సందేహం లేదు. నిదర్శనం కావాలా మీకు? అయితే సావధానంగా వినండి. ఇప్పుడు మిమ్మల్ని, మమ్మల్ని, పీక్కు తింటున్న సమస్య ఒక్కటే. అది ఎలెక్షన్ల గొడవ. ఈ మధ్యనే మా గ్రామప్రజలు ఒక విచిత్రమైన నిర్ణయానికి వచ్చారు. అదేమిటంటే అన్ని పార్టీల నాయకుల్ని మావూరికి పిలవడం, ఉపన్యాసాలిప్పించడం, ప్రతి ఒక్కరి వుపన్యాసం అవగానే ఆలోచించి వోటివ్వటం ఖాయమైతేనే చప్పట్లు కొట్టడం. మేం గ్రుడ్డిగా చప్పట్లు కొట్టాం.

మీలాగా. ఇక్కడే వుంది మీకు మాకు భేదం. ఇంతకూ చెప్పొచ్చేదేమంటే మా గ్రామస్థులు అనుకున్న ప్రకారంగా అన్ని పార్టీల నాయకుల్ని ఒకేరోజున ఆహ్వానించారు. తమ నిర్ణయాన్ని వారికి తెలియజేశారు. వారు మా ఆహ్వానాన్ని స్వీకరించి మా గ్రామం వేంచేశారు. ప్రథమంగా పెద్దలు కాబట్టి కాంగ్రెసు వారిని వుపన్యసించమన్నాం. సుప్రసిద్ధ దేశభక్తులు, ఐదు సంవత్సరాల యెనిమిది నెలల పదమూడు రోజుల తొమ్మిదిన్నర గంటలు దుర్భర జైలు జీవితం గడపిన అప్పయ్య చౌదరి గారు లేచి వుపన్యసించారు.

“మహాజనులారా! నేను మీ కందరకూ తెలుసుననుకుంటా. అది యిక్కడ వివరించ నక్కరలేదు. కాంగ్రెసును ఎరుగనివారు లేరు. మన వేడిరక్తం చిమ్మించి, నానాబాధలు పడి, కాంగ్రెసు నాయకత్వాన అనేక త్యాగాలు చేసి స్వాతంత్ర్యం సంపాదించుకున్నాం. కాంగ్రెసు నాయకులు జైళ్ళలో వుంటే, కమ్యూనిస్టులు బ్రిటిషువాళ్ళతో చేతులు కలిపారు. వారు మొదటిరకం దేశద్రోహులు. 1942 వుద్యమ సమయంలో తెల్లదొరల బంట్లు, పోలీసులు గ్రామాలమీదపడి ప్రజల మానప్రాణాలకు రక్షణలేకుండా చేస్తుంటే, మేము ప్రజల్ని సమీకరించి సాయుధ తిరుగుబాటు జరిపాం. కొన్నిచోట్ల పోటీ ప్రభుత్వాలు నడిపాం. గుంటూరుకు కొల్లూరు, భీమవరం లాఠీ దెబ్బలు మీకు మరపుగలరా? పూనా, బొంబాయి నగరాలలో విద్యార్థులపై ప్రయోగించిన మర తుపాకుల శబ్దం, యీనాటికీ మీ చెవుల్లో వినిపించడం లేదూ? మీరే కనుక కాంగ్రెసుకు వోటివ్వకపోతే, ఆ మృతవీరుల ఆత్మలకు శాంతి వుండదు.

సరే యెలాగో స్వాతంత్ర్యం తెచ్చాం. అది తెచ్చినప్పటినుంచి ఒక ప్రక్కన పాకిస్తాను, మరొక ప్రక్క మాస్కో మానసపుత్రులు దేశంలో అరాచకాన్ని ప్రేరేపించారు. ఎన్నో చిక్కుసమస్యల్ని పరిష్కరించాం. ఇంకా పరిష్కరిస్తున్నాం. అమెరికా నుండి ఆహార ధాన్యాలు తెప్పించాం. అనేక ప్రాజెక్టులకు ప్లానులు వేయించాం. కొత్తరోడ్లు, నగరాలు నిర్మించడానికి పూనుకోబోతున్నాం. ఈ విషయం పేపర్లలో మీరు చదివేవుంటారు. కృష్ణా, పెన్నారు ప్రాజెక్టుద్వారా మన సోదరులైన తమిళులకు సహాయంచేస్తున్నాం. ఈ విధంగా యీ రెండుజాతులమధ్య స్నేహాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తున్నాం. ఆంధ్రులు త్యాగమూర్తులని ఋజువు చేస్తున్నాం. దేశద్రోహుల్ని చీల్చి చెండాడడానికి మలబారు పోలీసుల్ని, స్పెషల్ పోలీసుదళాల్ని, పంపాం. మాకు తెలిసినంతవరకూ పోలీసు లెక్కడా దౌర్జన్యం చేయలేదు ప్రజలమీద. గిట్టనివాళ్ళ ప్రచారంవిని మోసపోకండి. మేమింకా అనేక ఘనకార్యాలు చేశాం. అస్సాముకు రైలు మార్గం వేయించాం. కాశ్మీరుకు రోడ్డు నిర్మించాం. ఇవన్నీ కాక, రైళ్లలో థర్డుక్లాసు పెట్టెలు తక్కువైనా వున్న ప్రయాణీకుల సౌకర్యంకోసం పంకాలు అమర్చాం.

ఆఖరు విషయం. అడుగో మన బాపూజీ! అదిగో మనల్నికన్న భారతమాత! కన్నీరు కారుస్తున్నారు. వారి కన్నీటిని మీరు చూడగలరా? చూడలేరు. కాబట్టి వెంటనే ఆలోచించకుండా వృషభరాజులకు వోటివ్వండి.”

మా గ్రామప్రజలు ఆలోచించడం మొదలెట్టారు. ఆట్టేసేపు పట్టలేదు లెండి. ఒక్క రెండు నిమిషాలు మాత్రమే. ఇంత త్వరగా యీ వ్యవహారం యెందుకు తేలిందంటారా? కారణం చెపుతా. చౌదరిగారు చివర అన్న ఆ రెండు ముక్కలు అంటే “బాపూజీ, భారతమాతల కన్నీరు” మా ప్రజల్ని కలవరపెట్టాయి. వారిద్దరు మా ప్రజల కళ్ళయెందు నిల్చొని, దీనంగా “కాంగ్రెసుకు వోటివ్వరూ?” అని ప్రార్థనాపూర్వకంగా అడిగినట్లు కనపడింది. ఇహ యెందుకు ఆలస్యం? వెంటనే చప్పట్లు అయిదునిమిషాలసేపు కొట్టారు అంతా. వాళ్లు బాగా ఆలోచించి, న్యాయమనినమ్మి, కొట్టారు కాబట్టి యింతసేపు పట్టింది చప్పట్లు కొట్టడం.

తరువాత కమ్యూనిస్టు అభ్యర్థి కామ్రేడ్ నారాయణ్ జుకోవ్ యీలా వుపన్యసించారు.

“కామ్రేడ్స్! తియ్యనిమాటలు విని, మోసపోకండి. తియ్యనిమాటలు చెప్పడం, హృదయాలు కరగించడం, బూర్జువాల, అభ్యుదయ

విరోధకుల, ఐక్యతావ్యతిరేకుల, విచ్ఛిన్నకారుల లక్షణాలు. కాంగ్రెసువారు చెప్పే దొకటి, చేసేదొకటి. ఈ ఐదేళ్ళలోనూ చూశారుగా మీరు వారి వ్యవహారం! అసలు ముందు నుంచి వద్దాం.

మేము ఎప్పుడూ దేశభక్తులమే. 1942కు పూర్వం బ్రహ్మాండమైన పోరాటాలు జరిపాం. 42లో హిట్లరు రష్యామీద దండెత్తగానే ఇంగ్లీషువారితో మేము తాత్కాలికంగా సంధి చేసుకున్నాం. ఆగస్టు వుద్యమం జరుగుతున్నప్పుడు దేశభక్తుల్ని, ప్రజల్ని లాఠీలతో కొడుతూవుంటే, అవి విరగకుండా చూశాం. మానభంగాలు జరుగుతూవుంటే, అది తప్పని చెప్పాం. ఆఖరుకు కన్నీరుకూడా కార్చాం. ప్రజానీకం తిండికోసం లూటీలు చేస్తూవుంటే, అది న్యాయశాస్త్రరీత్యా తప్పని వారి చేత మహాజర్లు పెట్టించి తిండిగింజలు సాధ్యమైనంత వరకు సరఫరా చేశాం. విద్యార్థులకు కిరసనాయిలు, చంటిపిల్లలకు పాలడబ్బాలు, కంట్రోలు ధరలకు ఇవ్వడం ధర్మం, అని వుద్యోగులను వేడుకున్నాం.

సరే స్వాతంత్ర్యం మేము కూడా కలిసి చివరకు తెప్పించాం. దేశం రెండు ముక్కలుగా చీలటం, న్యాయం, అని ప్రచారం చేసి, చివరకు అలా అవటానికి కారకులయ్యాం. కాంగ్రెసువారు సాధించిన ఘనకార్యాలు మీకు తెలుసు. పోలీసు దౌర్జన్యాల్ని ఎదిరించాం. రజాకార్లను తుదముట్టించాం. 10 లక్షల ఎకరాల భూమిని పేద రైతులకు పంచి పెట్టాం. స్త్రీల మానాల్ని రక్షించాం. ఇందుకోసం అవసరమైతే కొంతమంది స్త్రీలను కూడా చంపాం. ఉదాహరణకు అచ్చంపేట తీసుకోండి. అక్కడి ఘటనలు మేం చేసింది సరైన పని అని ఋజువు చేస్తాయి. అదంతా ఎందుకు? ఈనాడు హైదరాబాదు, తిరువాన్కూరు ఎన్నికలే మా కార్యక్రమం సరైనది అని ఋజువు చేస్తున్నాయి. అయితే కొంతమంది అమాయకుల్ని కూడా చంపాం. కాని యీ మధ్య మేం క్షమాపణ కోరుకున్నాంగా? కాబట్టి తప్పక మా పార్టీ అభ్యర్థుల్నే గెలిపించండి.”

గ్రామస్థులు ఆలోచించారు, వారి పాత వుద్రేకాలు యీ ఉపన్యాసం వినేటప్పటికల్లా మారిపోయాయి, ఒకవేళ కమ్యూనిస్టులు తప్పు చేస్తే క్షమించమని కోరుకుంటున్నారుగా! కాబట్టి ధర్మం, న్యాయం, వాళ్ళవైపే వుందని నిర్ణయించి కరతాళ ధ్వనులు చేశారు.

ఇక సోషలిస్టు అభ్యర్థి మొదలెట్టాడు—“కామ్రేడ్స్! అంటే నన్ను కమ్యూనిస్టు అని పొరపాటున అనుకుంటారేమో! కాదు కాదు! కామ్రేడ్స్, అనే పదం కమ్యూనిస్టులకే చెందుతుందని ఇదివరలో మేం కాంగ్రెసులోవుండగా వారితో కలిసి ప్రచారం చేసినా, ఈ మధ్య మా అభిప్రాయం మార్చుకున్నాం. ఇప్పుడు అలా అంటే తప్పులేదులెండి. అసలు విషయానికి వద్దాం.

మేము అసలు మొదట్లో కాంగ్రెసులోనే వున్నాం. మా పార్టీ పేరు ఇదివరకు కాంగ్రెసు సోషలిస్టు పార్టీ. కాబట్టి మేం కాంగ్రెసుకు దగ్గర బంధువులం. “కాంగ్రెసు” అనే పదం మానుండి విడిపోయినా, బాపూజీ, నేతాజీ అంటే మాకెంత గౌరవమో మీకే తెలుసు. మన నాయకులు జైళ్లలో వున్నప్పుడు చెల్లాచెదరై, నిరాశతో వున్న ప్రజానీకాన్ని సంఘటిత పరచి నాయకత్వం వహించి, తెల్లదొరల మీద యుద్ధం ప్రకటించాం. అనేకమంది మా పార్టీ వర్కర్లు రణరంగంలో వీరస్వర్గం అలంకరించారు. ఆ సమయంలో మీ అమాయకత్వాన్ని తమ స్వార్థానికి కమ్యూనిస్టులు ఎలా ఉపయోగించుకున్నారో మీకు తెలుసు. మీలో వున్న విప్లవ శక్తిని నిర్మూలించాలని కమ్యూనిస్టులు ప్రయత్నించారు. కాంగ్రెసు నాయకులు ఒకనాటి ఆగస్టు వుద్యమానికి అధినేతలమనని ప్రజలముందు చెప్పుకుంటూ, ఏవెం మాంటుబాటెన్ దొరలతో ఆ వుద్యమానికి తమకు ఏమీ సంబంధం లేదని సిగ్గువిడిచి చెప్పుకుని రాజీకోసం తాపత్రయ పడ్డారు.

పోనీ, స్వాతంత్ర్యం వచ్చాక ఏమైనా చేశారా అంటే లేదు. అనేకమంది మా పార్టీ వర్కర్లని జైళ్ళలో బంధించారు. మా నాయకులపై నిషేధాజ్ఞలు జారీచేశారు. ఇది ఎంత అన్యాయం! మీరే ఆలోచించండి. మా

పార్టీ మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాన్ని హెచ్చుచేస్తుంది. ఆర్థిక అసమానత నిర్మూలిస్తుంది. కాంగ్రెసువారు కేవలం కాగితాల మీద ప్లానులువేసి మీ వోటు తమకిమ్మని, యిస్తే ఆ ప్రణాళికలు అములుజరుపుతామని, అబద్ధాలు చెపుతొన్నారు. మీరు యివి నమ్మ వద్దు మేమే అధికారంలోకి, వస్తే ఆ ప్రణాళికలు గంటకొకటి చొప్పున అములు జరిపిస్తాం.

ఇక విదేశాంగ విధానంగురించి: రష్యాకు మన కమ్యూనిస్టులు ఎలా దాసోహం చేస్తున్నారో, మాటల్నిబట్టి, చేతల్నిబట్టి మీకు అర్థం అవుతోంది. కాంగ్రెసు నాయకులు మన దేశాన్ని అమెరికాకు గులాముగా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. మళ్ళీ బానిసత్వం మీరు వొప్పుకుంటారా? ఎన్నటికీ వొప్పుకోరు. అంగకనే మా పార్టీ మధ్యే మార్గం అవలంబించమంటోంది. అంటే తటస్థ విధానం అన్న మాట. రష్యా అమెరికాలు మట్టిలో కలసినా సరే భారతదేశం చేతులు ముడుచుకు కూర్చోటం వుత్తమం. అయినా పరాయివాళ్ళ జోలి మన కెందుకు? మన యింట్లో మనం హాయిగా కూర్చుందాం. కొబట్టి, మీరు తప్పకుండా మా పార్టీకే వోటివ్వండి”

మళ్ళా ఆలోచించారు. పది నిముషాలు ఆలోచించారు. ఏమీ తప్పు కనపడడంలేదు. నిజంగా పరాయి దేశస్థుల జోలి మనకెందుకు? మన యింట్లో మనం హాయిగా వుందాం. వాళ్ళే గంగలో కలిస్తే మనకెందుకు? కొబట్టి ఇలాంటి విధానం అములులోనికి రావాలంటే సోషలిస్టులకే యివ్వాలి. ఇంకేముంది? మళ్ళీ ఒక్క సారి గట్టిగా చప్పట్లు మ్రోగాయి.

రామరాజ్య పరిషత్తు అభ్యర్థి క్లుప్తంగా మూడు ముక్కల్లో చెప్పాడు.

“రామభక్తుల్లారా! ఏమీ విచారించొద్దు కాంగ్రెసువాళ్లు మనకేమీ వొరిగించలేదు. కమ్యూనిస్టులూ చేయలేరు. అసలు రహస్యం ఏమిటంటే రాముడి ఆజ్ఞ లేనిదే ఏమయినా సుఖమైన జీవితాలు మనం అనుభవించగలమా? రామరాజ్యం గురించి వేరే వర్ణించక్కరలేదు. కరువు కాటకాలుండేవి కావు. ప్రజలు త్యాగధనులు. అందులో ధనవంతులు ఆశ్రిత జన రక్షకులు. ఇంతకూ ఎవరి కర్మానికెవరు కర్తలు? మీరీ జన్మలో కష్టపడుతున్నారంటే, దానికి కారణం మీరు పూర్వజన్మలో చేసిన పాపమే. అదే శాస్త్రాల్లో గూడా రాసివుంది. ఏది ఎలా వున్నా, రామరాజ్య స్థాపన జరిగితే అన్ని యిబ్బందులూ తొలగుతాయి. అఖరుకు మీలో ఎవరికి ఏవిధమైన రోగాలుగాని, జబ్బులుగాని వుంటే అవి శ్రీరాముని దయవలన పోతాయి. అంతేకాని డాక్టర్లేం చేస్తారు? ఈ విషయమే మేము బెజవాడ ప్రభుత్వ ధర్మాసుపత్రి గోడలమీదకూడా రాశాం. కొబట్టి మీరు రామరాజ్య పరిషత్తు అభ్యర్థులకే వోటిచ్చినట్లయితే, ధనవంతులుండవలసిన రీతిని ధనవంతులుంటారు, పేదప్రజ లుండవలసిన రీతిని పేద ప్రజలుంటారు, ఆడవాళ్లు చక్కగా నాలుగు గోడలమధ్య కూర్చుని మీరు సంపాదించిన ఆస్థిపాస్థులు జాగ్రత్తగా కనిపెడుతూ, పిల్లల్ని కంటూ, పెంచుతూ ఇల్లు స్వర్గతుల్యం చేస్తారు. అంతా రామునిదయ! జై! సీతారాములకు జై!”

ఆహా! నిజంగా అంతా రామునిదయే! గ్రామస్థులు ఇప్పుడు కనుక్కున్నారీ విషయం. ఆ శ్రీరాముని దయ లేనిదే యెవరేం చేయ గలరు? అంతా ఆయనే నడిపిస్తున్నాడు. కొబట్టి శ్రీరామచంద్రమూర్తికే వోటివ్వాలి. వెంటనే మ్రోగాయి చప్పట్లు.

ఎంత చైతన్యవంతులు మా వూరి ప్రజలు! నిజంగా రాజకీయాలు చక్కగా అర్థం చేసుకుంది మా గ్రామస్థులే. ఇందులో సందేహం లేదు. అప్పటికీ మరీ మరీ ఆలోచించి చప్పట్లు కొడుతూ వచ్చారు, నిజంగా అపూర్వ రాజకీయ చైతన్యం! భారతదేశంలో వున్నందుకు మా గ్రామస్థులు గర్విస్తున్నారు. మా గ్రామం భారతదేశంలో వున్నందుకు భారతీయులు గర్వించాలి.

---

ప్రజలు తమ అసంతృప్తి తెలపడానికే వోటు చేస్తారు. ఏ మానిసి తనకేది అక్కరలేదో తెలుపుతూ వోటువేస్తాడు, తనకేది కావాలో దానికి కాదు.—మన్రో